క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న మృత్యుంజయం, రవీందర్‌రావు

గంభీరావుపేట: యువకులు క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం, నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేట క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేజీ టు పీజీ క్రీడా మైదానంలో జీపీఎల్(గంభీరావుపేట ప్రీమియర్ లీగ్) క్రికెట్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. పోటీల్లో ఆరు జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు దేవేందర్‌యాదవ్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ మండల అధ్యక్షులు హమీద్, వెంకటస్వామిగౌడ్, రమేశ్, సెస్ మండల డైరెక్టర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం నేతల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: బీసీ నాయకుడైన ఆది శ్రీనివాస్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అవమానిస్తున్నారని, ఆరోపిస్తూ బీసీ సంఘం నేతలు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రజల కోసం పాటుపడుతున్న ఆది శ్రీనివాస్‌ను అవమానించడం సరికాదని హితవు పలికారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే ప్రతీ గ్రామం నుంచి బీసీ బిడ్డలు పెద్ద ఎత్తున తరలివచ్చి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఎస్జీఎఫ్ పోటీల్లో ప్రతిభ

గంభీరావుపేట: ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడా సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన వుషు ఎస్జీఎఫ్ క్రీడాపోటీల్లో మండల క్రీడాకారులు ప్రతిభ కనబర్చినట్లు జిల్లా వుషు కార్యదర్శి విక్రం తెలిపారు. అండర్ 19 బాల బాలికల ఎంపిక పోటీల్లో బాలికల విభాగంలో అశ్విని, కనకలక్ష్మీ, శ్రీవాణి, బాలుర విభాగంలో శశిధర్ ప్రతిభ చూపినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను కోచ్ విక్రంతో పాటు డీవైఎస్‌వో అజ్మీర రాందాస్, ఎంఈవో గంగారాం, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలత, పీఈటీ మంజుల, యోగ కోచ్ దేవయ్య, అథ్లెటిక్ కోచ్ జంపన్న, గంభీరావుపేట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

శివకేశవ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్ శ్రీ శివకేశవ ఆలయంలో విగ్రహ పునర్ ప్రతిష్ఠ వేడుకలు రెండోరోజు మంగళవారం వైభవంగా జరిగాయి. అర్చకులు బ్రహ్మశ్రీ రాచర్ల విశ్వనాథం శర్మ, బ్రహ్మశ్రీ రాచర్ల శ్రీని వాసశర్మ, బ్రహ్మశ్రీ కొండపాక శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో యజ్ఞం, దేవతాహ్వాన పూజలు నిర్వహించారు. యజ్ఞంలో పలువురు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఓటరు జాబితా పరిశీలన



వేములవాడరూరల్: మండలంలోని వట్టెంలలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటా ఓటరు జాబితాను పరిశీలించారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్, రూరల్ మండల అధ్యక్షుడు రోమాల ప్రవీణ్, నాయకులు ఇంటింటా తిరుగుతూ ఓటర్ లిస్టును పరిశీలించారు. వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్, గ్రామశాఖ అధ్యక్షుడు శంకర్, మండల యూత్ కోఆర్డినేటర్ గుడిసె ప్రసాద్, నాయకులు ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ముస్తాబాద్: ఆవునూర్‌కు చెందిన కాసారపు రాజేశ్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. మెరుగైన వైద్యంకోసం విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రాజేశ్ వైద్యానికి రూ.5లక్షలు మంజూర య్యాయి. ఎల్‌వోసీ మంజూరు చేయించిన విప్ శ్రీనివాస్‌కు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గంభీరావుపేట: మండలంలోని నాగంపేటలో చోరీ జరిగింది. నాగంపేటకు చెందిన శనిగరపు సుదర్శన్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లారు. దొంగలు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని దాదాపు పది తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి దొంగలు చోరీకి పాల్పడ్డట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించి వివరాలు సేకరిస్తున్నారు.



బతుకమ్మ అంటేనే సంబరం

బతుకమ్మ పండగ అంటేనే మహిళలకు సంబరం. ఏడాదికోసారి జరిగే పండగలో ఇంటిల్లిపాది ఆనందంగా గడుపుతారు. గతంలో గ్రామ శివారులోకి వెళ్లి తంగేడు, గునుగు పూలను తెచ్చేవాళ్లం. ఇప్పుడు అంతా రెడీమేడ్ అయింది. మార్కెట్‌లోనే పూలను కొనుక్కోవాల్సి వస్తోంది. డీజే పాటలు పెట్టి బతుకమ్మ ఆడుతున్నారు.



– గాండ్ల సుమతి, ముస్తాబాద్

ఏడాదికోసారి వచ్చే పూల పండుగ

బతుకమ్మ ఏడాదికోసారి వచ్చే పూలపండగ. పూలనే పూజించే గొప్ప పండగ బతుకమ్మ. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుంది. 15 రోజుల ముందునుంచే సందడి మొదలవుతోంది. ఎంతో సంబరంగా జరుపుకునే పండగ అంటే మహిళలకు ఇష్టం. తొమ్మిది రోజులపాటు ఊరూరా ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొంటారు.



– చర్లపల్లి స్రవంతి, ముస్తాబాద్

తొమ్మిది రోజులు ఉత్సాహంగా

ఉదయాన్నే గునుగు, తంగేడు, చామంతి, పూలు తెచ్చి బతుకమ్మను పేరుస్తాం. ఏ పండుగైనా ఎవరి ఇళ్లలో వారే జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ మాత్రం తొమ్మిది రోజులు మహిళలందరినీ ఒక్క చోటకు చేర్చుతుంది. ఊరూ, వాడా చుట్టాలు, బంధువులను ఒక్కచోట కలిపే బతుకమ్మ అంటే మాకుటుంబమంతటికీ ఎంతో ఇష్టం.



– బొలుమాల లాస్య, గాలిపెల్లి

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



సిరిసిల్ల టౌన్ : మార్కండేయ వీధిలోని దుర్గామాత సన్నిధిలో పూజలు



ముస్తాబాద్ : పోతుగల్‌లో పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



ఇల్లంతకుంటలో ..



ఎల్లారెడ్డిపేటలో ..

సిరిసిల్లటౌన్/గంభీరావుపేట/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/బోయినపల్లి: లోకపావని దుర్గామాతను ప్రజలు భక్తితో కొలిచారు. మంగళవారం అమ్మవారు గాయత్రీమాత రూపంలో దర్శనమిచ్చారు. పట్టణంలోని అన్ని దుర్గామాత మంటపాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో తరించారు. నమోస్తుతే మాతా.. శరణు..శరణు అంటూ పూజలు చేశారు. గంభీరావుపట మండలకేంద్రంలో మున్నూరుకాపు సంఘంలో, మార్గదర్శి యూత్ ఆధ్వర్యంలో, హనుమాన్ నగర్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. అమ్మవారు గాయత్రీ మాత రూపంలో దర్శనమిచ్చారు. మార్గదర్శి యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత సన్నిధిలో నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. సెస్ మండల డైరెక్టర్ నారాయణరావు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు. ముస్తాబాద్ మండలంలో దేవీ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గాయత్రీమాత అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఇల్లంతకుంట మండలకేంద్రంలోని హిందూ వాహిని ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో మహిళలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బోయినపల్లి మండలం తడగొండలో దుర్గామాత మండపాల్లో పూజలు చేశారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చందుర్తి: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సౌందర్య అన్నారు. మండలంలోని ఆశిరెడ్డిపల్లెలో పోషణ మాసోత్సవంలో భాగంగా బాలింతలకు పోషకాహారంపై మంగళవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలతో పోషక పదార్థాలు అధికంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, అంగన్‌వాడి టీచర్లు మంగ, మంగాదేవి, ,ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



కోనరావుపేట: అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోనరావుపేట: మండలంలోని గోవిందరావుపేట తండా (బావుసాయిపేట)లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ గంగ లక్ష్మి మాట్లాడుతూ ముర్రుపాలు, పోషకాహారం గురించి అవగాహన కల్పించచారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ చీటీ వెంకటరమణాదేవి, కార్యదర్శి నవీన్, మహిళా గ్రూపు అధ్యక్షురాలు, ఆశా కార్యకర్త, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండలంలోని మానాల ఒకటో అంగన్‌వాడీ కేంద్రం, మండలకేంద్రంలోని దసరా నాయక్ తండా, వీరుని తండాలోని అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అంజలి దేవి, శారద ,రజిత, వసంత, తల్లులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ముస్తాబాద్: వైద్య శిబిరంలో మహిళలు

ముస్తాబాద్: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మండలంలోని మద్దికుంట ఆరోగ్య ఉప కేంద్రంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 81 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్ఎల్‌హెచ్‌పీ శివాంజలి, ఏఎన్‌ఎం మణెమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలోని పల్లె దవాఖానాలో ఆరోగ్య వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గైనకాలజిస్ట్ సోనియా, యూనాని మెడికల్ ఆఫీసర్ నవీన్, యోగా కోచ్ దేవయ్య, పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: పెద్ద లింగాపూర్ పల్లె దవాఖానలో మహిళలకు వైద్యశిబిరం నిర్వహించారు. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన, పోషకాహార ఆవశ్యకత గురించి వివరించినట్లు వైద్యురాలు ఫాతిమా తెలిపారు. వైద్యులు రసజ్ఞ, మౌనిక, హెచ్ఈఓ వెంకటరమణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి ఆరోగ్య ఉపకేంద్రాల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. 115 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఎస్ ఇందిరా, ఎంఎల్ హెచ్‌పీ ఆకాష్, ఏఎన్‌ఎంలు తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

• బాధ్యతలు స్వీకరణ

వేములవాడ: వేములవాడ సబ్‌కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అవధూత రజనీకాంత్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, న్యాయవాదులు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్పీ మహేశ్ బీ గీతే, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డిరని మర్యాదపూర్వకంగా కలిశారు.

• జీవో నంబర్ 12ను సవరించాలి

సిరిసిల్ల అర్బన్: ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 12ను సవరించాలని, వెల్ఫేర్ బోర్డు క్లెయిమ్‌లను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పజెప్పడం మానుకోవాలని బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా లేబర్ అధికారి నజీర్‌కు కూడిన వినతిపత్రం అందించారు. ఇక్కడ ఈసంపెల్లి రాజేలయ్య, ప్రభాకర్, దేవయ్య, నాగరాజు తదితరులున్నారు.

• కలెక్టరేట్ ఎదుట నిరసన

రుద్రంగి: ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు సమయానికి హాజరుకాకుండా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను, జాతీయ గీతాన్ని అవమానపర్చేలా వ్యవహరించిన కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం బీసీ నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.

• కాంగ్రెస్‌కు రాజీనామా

ఇల్లంతకుంట: కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సావనపెల్లి రాకేష్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాకేష్ ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ గా వ్యవహరిస్తున్నారు. తాను ఏ పార్టీలో కొనసాగనని ప్రజాసమస్యలపైనే పోరాడుతానని పేర్కొన్నారు.

• ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్‌చేసి ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెర్లుమద్ది నక్కవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మంగళవారం ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. పోతుగల్ నర్సింలు తండాకు చెందిన రమావత్ నవీన్ (20), రమావత్ ప్రవీణ్ (23) ఇద్దరు ఇసుక రవాణా చేస్తూ పట్టుపడ్డారన్నారు. ట్రాక్టర్లను ఠాణాకు తరలించి, ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

• చెట్లు నరికివేత

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు కొట్టివేశారు. చెట్లను నరికివేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

• కొండ చిలువ హతం

ఎల్లారెడ్డిపేట: దుమాలలో నిమ్మల బాలుకు చెందిన కోళ్లఫారంలోకి మంగళవారం కొండ చిలువ రాగా గమనించిన గ్రామస్తులు కొండచిలువను చంపారు. రెండ్రోజుల క్రితం మండలకేంద్రం శివారులోని డిగ్రీ కళాశాల సమీపంలో కనిపించిన విషయం తెలిసిందే. వరుసగా కనిపిస్తున్న కొండచిలువలతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

రైతులకు అవగాహన



విత్తనోత్పత్తి క్షేత్రాలను సందర్శిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

రుద్రంగి: కరీంనగర్ జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.కె.మదన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం రుద్రంగి రైతు వేదికలో రైతులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందే విధానాలు, పంటల విభజన, పశుపోషణ, తేనెటీగల పెంపకం, తదితర అనుబంధరంగాల వ్యాపార అవకాశాలను వివరించారు. అనంతరం పంట క్షేత్రాలకు సందర్శించారు. కో ఆర్డినేటర్ డా.బి.హరికృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఓటు చోరీపై మంగళవారం అవగాహన కల్పించారు. రాహుల్ గాంధీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ×ఓటు చోరీ కార్యక్రమంలో భాగంగా బూత్ నెంబర్ 231లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలకు ఓటువిలువ, ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రాధాన్యంపై వివరించారు. ప్రతీ ఒక్కరు ఓటును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఎక్కలదేవి శ్రీనివాస్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ పాకాల వినయ్, బూత్ అధ్యక్షుడు జంగం దయాకర్, షేక్ అశ్రఫ్, నవీన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్లటౌన్: తెలంగాణ గురుకులాల కాంట్రాక్టర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు కంసాల మల్లేశం తెలిపారు. అధ్యక్షుడిగా బూర యాదగిరి, ఉపాధ్యక్షులుగా జలగం శ్రీనివాసరావు, కందుకూరి హరీశ్, ప్రధాన కార్యదర్శిగా సుల్తాన్ ఎల్లయ్య, సహాయ కార్యదర్శిగా దొంతుల బాలరాజు, కోశాధికారిగా పళుల దేవయ్య, కార్యవర్గ సభ్యులుగా బండారి వెంకటేశం, మార్గం రమణ, ప్యారం రాజేశం, ఆనందం, బాలరాజు, సలహాదారులుగా భూక్య గజన్‌లాల్ లను నియమించినట్లు మల్లేశం పేర్కొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ఆర్థిక చేయూత



మాట్లాడుతున్న పరశురామ్

బోయినపల్లి: జీఎస్టీ తగ్గింపుతో ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఆర్థిక చేయూత ఇచ్చినట్లవుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సవరణలతో ఏటా సుమారు రూ. లక్ష కోట్లవరకు ఆదాయ నష్టం తలెత్తే అవకాశం ఉన్నా పేదల కోసం మంచి నిర్ణయం తీసుకున్నారన్నారు. చిన్న వ్యాపారాలకు పన్ను విధానం సులభతరం కావడంతో వ్యాపారవేత్తలకు ఊతం లభిస్తుందని ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు. ఆయన వెంట జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహచారి, మండల మాజీ అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, నాయకులు సుంకపాక ప్రభు, బొంగోని అశోక్, స్వామి కుమార్, మెరుపుల గంగాధర్, మిరియాల శరత్, సారంపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

వీర్నపల్లి : విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని, రైతులు సకాలంలో విద్యుత్ బకాయిలు చెల్లించి విద్యుత్ సంస్థకు సహకరించాలని సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం అన్నారు. మండలంలోని గర్జనపల్లి, సీతారాంనాయక్ తండా, వన్‌పల్లి కేలోత్ తండాల్లో పరిశీలించి విద్యుత్ సమస్యలపై సిబ్బంది, రైతులతో చర్చించారు. ఇటీవల ఓ రైతు తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్‌పోయి వరి పంట దెబ్బతిందని సెస్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పంట పొలాన్ని పరిశీలించారు.



గంభీరావుపేట: గంభీరావుపేట మండలకేంద్రంలోని ప్రభుత్వ పశువైద్యశాలలో వర్షపు నీరు నిలిచి లోపలికి వెళ్లేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. వైద్యశాల ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా తయారైంది. అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : రామానుజన్
పశువైద్యాధికారి, సెల్ : 7032265545

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

బతుకమ్మ వేడుకలు



ఎల్లారెడ్డిపేట: రాజన్నపేటలో బతుకమ్మ పేర్చుతున్న మహిళలు



సిరిసిల్ల కల్చరల్ : బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట/సిరిసిల్ల కల్చరల్ : ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేటలో మూడోరోజు మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు భారీగా తరలివచ్చి బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. మాజీ సర్పంచ్ ముక్క శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గుండాడి రామ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మలు పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి కె. సంగీత, సహాయ గిరిజనాభివృద్ధి అధికారి ఎస్.దివాకర్ రావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా వాడకం తగ్గించాలి

బోయినపల్లి: దుండ్రపల్లిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు సోకిన వరి పొలాన్ని మంగళవారం పరిశీలించినట్లు ఎంఏవో ప్రణీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానాకాలంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండి వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు వచ్చిందని తెలిపారు. నివారణకు తెగులు సోకిన పొలం నుంచి సాగునీటిని మురుగు కాల్వల ద్వారా బయటకు పంపాలని పేర్కొన్నారు. యూరియా వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. ఆమె వెంట ఏఈవో లక్ష్మణ్, రైతులు ఉన్నారు.

గుంత పూడ్చివేత

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టంపల్లిలో ప్రమాదకరంగా ఉన్న గుంతను గ్రామపంచాయతీ సిబ్బంది మంగళవారం పూడ్చివేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రోడ్లపై గుంతలను పూడ్చివేశారు.

నిలిచిన రాకపోకలు



ఇల్లంతకుంట: మండలంలోని తాళ్లపల్లి– గూడెం మధ్య అంపు ఒర్రెపై పోసిన మట్టి కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నెల రోజుల క్రితం పతికుంటపల్లి చెరువు మత్తడి దూకడంతో వరద ఉధృతికి అంపు ఒర్రెపై మట్టి కొట్టుకుపోవడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇటీవల మళ్లీ వర్షాలకు మట్టి కొట్టుకుపోవడంతో వారంరోజుల క్రితం రైతులు ఒర్రెపై జేసీబీ, ట్రాకర్ల ద్వారా మొరం పోశారు. సోమవారం కురిసిన భారీ వర్షంతో ఒర్రెపై మట్టి కొట్టుకుపోయి మళ్లీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

జాగ్రత్తలు పాటిస్తేనే పంటల రక్షణ

వేములవాడఅర్బన్: పంటల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులు వర్షాకాలంలో వేసిన పంటలను ఎలా కాపాడుకోవాలి. ఎలాంటి ఎరువులు వాడాలి. పంటల పురుగు నివారణకు ఎలాంటి మందులు పిచికారీ చేయాలని వేములవాడ మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ సూచించారు.

46,080 ఎకరాల్లో

⇨ జిల్లాలోని సుమారు 46,080 ఎకరాలో పత్తిపంట వేశారు.

⇨ వరిపంట సుమారుగా 1,84,860 ఎకరాలు.

⇨ పత్తికి పొగాకు లద్దెపురుగు ఎక్కువగా వస్తుంది. దాని నివారణకు ఇమేక్టిన్ బెంజ్‌ఏట్ 120 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలి..

⇨ పత్తిలో రసం పీల్చు పురుగు నివారణకు అసెఫేట్ 400 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలి..

⇨ పత్తిలోని వేరు కుళ్లు నివారణకు కాఫర్ ఆక్సీక్లోరైడ్ 600 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలి.

⇨ పత్తి గూడ రాలకుండా ఉండేందుకు బోరాక్స్ 30 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలి.. పంటలో వర్షపునీరు నిల్వకుండా ఉండాలి.



పురుగు మందులు వాడే విధానం..

⇨ వరి పంటకు వర్షాకాలంలో ఎక్కువగా ఖండం తొలుచు పురుగు వస్తుంది. దాని నివారణకు కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ ఎకరానికి 400 గ్రాములు పిచికారీ చేయాలి.

⇨ పాముపూడ తెగులు నివారణకు ఎగ్జకోనజోల్ 400 ఎమ్ఎల్ ఎకరానికి పిచికారీ చేయాలి

⇨ వరిపంటకు బ్యాక్టీరియా ఎండుతెగులు నివారణకు స్ట్రెప్టోమైసిన్ 40 గ్రాములు పిచికారీ చేయాలి.

⇨ వరిలో పంటలో అగ్గితెగులు నివారణకు ట్రైక్లోజోన్ 120 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలి.

రోడ్డు మరమ్మతులు

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లి రోడ్డు అధ్వానంగా మారింది. గ్రామానికి చెందిన దమ్మ శ్రీనివాస్‌రెడ్డి జేసీబీ సమకూర్చగా గ్రామంలోని ట్రాక్టర్ యూనియన్ సభ్యులు ట్రాక్టర్లు ఏర్పాటు చేసి రోడ్డుపై మొరం పోసుకున్నారు. రోడ్డు బాగు కోసం సహకరించిన వారికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.